# చరిత్ర సృష్టించిన ఆస్ట్రేలియా కెప్టెన్ మేగ్ లానింగ్

## రికీ పాంటింగ్, మహేంద్ర సింగ్ ధోనీల రికార్డులు బద్దలు



న్యూఢిల్లీ,ఫిబ్రవరి 27 (సమ సమాజం): మహిళల టీ20 వరల్డ్ కప్ నెగ్గిన ఆస్ట్రేలియా కెప్టెన్ మేగ్ లానింగ్ చరిత్ర సృష్టించింది. దిగ్గజ కెప్టెన్లు రికీ పాంటింగ్, మహేంద్ర సింగ్ ధోనీల రికార్డును బద్దలు కొట్టింది. అత్యధిక ఐసీసీ ట్రోఫీలు సాధించిన తొలి కెప్టెన్‌గా రికార్డు క్రియేట్ చేసింది. మేగ్ లానింగ్ కెప్టెన్సీలో ఆస్ట్రేలియా మహిళల జట్టు ఐదు సార్లు విశ్వవిజేతగా నిలిచింది. మేగ్ లానింగ్ కెప్టెన్సీలోఆస్ట్రేలియా ఉమెన్స్ టీమ్..2014, 2018, 2020, 2023లో టీ20 వరల్డ్ కప్ గెలిచింది. అంతేకాకుండా 2023లో వన్డే వరల్డ్ కప్‌లోనూ విజేతగా నిలిచింది. అటు 2022 కామన్‌వెల్త్ గేమ్స్‌లో లానింగ్ నాయకత్వంలోనే ఆస్ట్రేలియా ఛాంపియన్‌గా అవతరించింది. దీంతో ఆసీస్‌కు ఐదు ఐసీసీ ట్రోఫీలు అందించిన తొలి కెప్టెన్‌గా లానింగ్ రికార్డు నెలకొల్పింది. క్రికెట్ చరిత్రలో ఇప్పటి వరకు అత్యధిక ఐసీసీ ట్రోఫీలు సాధించిన కెప్టెన్లు ముగ్గురు ఉన్నారు. ఈ జాబితాలో మేగ్ లానింగ్ నెంబర్ వన్ ప్లేస్ లో ఉంది. రెండో స్థానంలో రికీ పాంటింగ్ నిలిచాడు. పాంటింగ్ కెప్టెన్సీలో ఆస్ట్రేలియా 2003,2007 వన్డే వరల్డ్ కప్‌లను సాధించింది. ఆ తర్వాత 2006,2009 లో ఛాంపియన్స్ ట్రోఫీలు సొంతం చేసుకుంది. ఈ జాబితాలో టీమిండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ మూడో ప్లేస్‌లో ఉన్నాడు. ధోని కెప్టెన్సీలో టీమిండియా మూడు ఐసీసీ ట్రోఫీలు దక్కించుకుంది. 2007లో టీ20 వరల్డ్ కప్, 2011లో వన్డే వరల్డ్ కప్, 2013లో ఛాంపియన్స్ ట్రోఫీని భారత జట్టు గెలిచింది.

# పంత్ ఇప్పుడప్పుడే జట్టులోకి రాలేదు

## మరో ఏడాది, రెండేళ్ల సమయం పట్టొచ్చు

### ఢిల్లీ కేపిటల్స్‌లో పంత్ స్థానం పూరించడం కష్టమే : గంగూలీ

న్యూఢిల్లీ,ఫిబ్రవరి 27 (సమ సమాజం): రోడ్డు ప్రమాదంలో గాయపడి కోలుకుంటున్న టీమిండియా వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ కెరియర్‌పై టీమిండియా మాజీ సారథి, బీసీసీఐ మాజీ బాస్ సౌరవ్ గంగూలీ కీలక వ్యాఖ్యలు చేశాడు. పంత్ తిరిగి భారత జట్టులో చేరి ఆడేందుకు రెండేళ్ల వరకు పడుతుందని అంచనా వేశాడు. పంత్ తిరిగి జట్టులోకి వచ్చి ఆడాలంటే ఏడాది లేదంటే రెండేళ్లయినా పట్టొచ్చని అభిప్రాయ పడ్డాడు. త్వరలో జరగనున్న ఐపీఎల్‌లో ఢిల్లీ కేపిటల్స్ జట్టు మేనేజ్‌మెంట్ బాధ్యతల్లో ఉన్న గంగూలీ తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశాడు. ఢిల్లీ కేపిటల్స్ జట్టులో పంత్ స్థానాన్ని పూడ్చడం కష్టసాధ్యమన్న గంగూలీ.. అతడి స్థానంలో జట్టులోకి వచ్చేదెవరన్న విషయంలో జట్టు ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నాడు. పంత్‌కు ప్రమాదం జరిగిన తర్వాత తాను రెండుసార్లు మాట్లడినట్టు చెప్పాడు. ప్రస్తుతం అతడికి కష్టకాలం నడుస్తోందని, గాయాలు, సర్జరీ నుంచి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించినట్టు తెలిపాడు. ఢిల్లీ జట్టు ఇంకా పంత్ రీప్లేస్‌మెంట్‌ను ప్రకటించలేదు. యువ ఆటగాళ్లు అభిషేక్ పోరెల్ లేదంటే దేశవాళీ వెటరన్ ఆటగాడు షెల్డన్ జాక్సన్‌ను తీసుకోవాలా? అనే విషయంలో గంగూలీ కూడా ఇంకా ఒక నిర్ణయానికి రాలేకపోతున్నాడు. ఈ విషయంలో నిర్ణయం తీసుకునేందుకు కొంత సమయం పడుతుందని గంగూలీ చెప్పుకొచ్చాడు.



# ఆసియా కప్ కోసం పాక్ వెళ్లరాదు

## బిసిసి నిర్ణయాన్ని సమర్థించిన భజ్జీ



న్యూఢిల్లీ,ఫిబ్రవరి 27 (సమ సమాజం): ఆసియా కప్ 2023 ఎక్కడ జరుగుతుంది? అసలు జరుగుతుందా? లేదా? సగటు క్రికెట్ అభిమానుల మదిలో మెదులుతున్న ప్రశ్నలివి. ఈ ఏడాది ఆసియా కప్ ఆతిథ్య హక్కులను పాకిస్థాన్ దక్కించుకుంది. సెప్టెంబరులో జరగాల్సి ఉంది. అయితే, ఆసియాకప్ కోసం భారత జట్టు పాకిస్థాన్ వెళ్లబోదని ఏషియన్ క్రికెట్ కౌన్సిల్ చైర్మన్ కూడా అయిన బీసీసీఐ కార్యదర్శి జై షా గతేడాది అక్టోబరులో తేల్చి చెప్పారు. అదే జరిగితే తాము కూడా ఇండియాలో జరిగే ప్రపంచకప్‌కు రాబోమని పాక్ క్రికెట్ బోర్డు ప్రకటించింది. దీంతో ఇరు బోర్డుల మధ్య అగ్గిరాజుకుంది. ఇప్పటికీ ఈ వివాదం కొలిక్కి రాలేదు. ఆసియాకప్ కోసం భారత జట్టు పాకిస్థాన్ వెళ్లాలా? వద్దా? అనే విషయంపై భారత స్పిన్ దిగ్గజం హర్భజన్ సింగ్ స్పందించాడు. బీసీసీఐ నిర్ణయం సబబేనని అన్నాడు. పాకిస్థాన్‌కు మన జట్టును పంపొద్దని సూచించాడు. ఇటీవల పాకిస్థాన్ కరాచీ స్టేడియం సమీపంలో కాల్పులు జరిగాయని గుర్తు చేశాడు. ఏ క్షణాన ఏం జరుగుతుందో చెప్పలేని చోటికి జట్టును జట్టును పంపొద్దని కోరాడు. ఆటగాళ్ల భద్రతకు ప్రమాదం ఉండే ఏ చోటికైనా ఆటగాళ్లను పంపకపోవడమే ఉత్తమమని అభిప్రాయపడ్డాడు.

# కేన్ విలియమ్సన్ అరుదైన రికార్డు

## టెస్టుల్లో 7,684 పరుగులతో రాస్ టేలర్ రికార్డు బద్దలు



లండన్,ఫిబ్రవరి 27 (సమ సమాజం): న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్ అరుదైన రికార్డును సొంతం చేసుకున్నాడు. టెస్టుల్లో న్యూజిలాండ్ తరపున అత్యధిక పరుగులు చేసిన చేసిన బ్యాటర్‌గా చరిత్ర కెక్కాడు. ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టెస్ట్‌లో సెంచరీ చేసిన కేన్ మామ..కివీస్ మాజీ క్రికెటర్ రాస్ టేలర్ రికార్డును బద్దలు కొట్టాడు. ఇంగ్లండ్‌తో రెండో టెస్ట్ నాలుగోరోజు అండర్సన్ బౌలింగ్‌లో బౌండరీ బాదిన కేన్ విలియమ్సన్ టెస్టుల్లో 7,684 పరుగులు సాధించాడు. ఇక రాస్ టేలర్ 112 టెస్టుల్లో 7, 683 పరుగులు చేశాడు. ఇందులో 19 సెంచరీలు, 3 డబుల్ సెంచరీలు ఉన్నాయి. 35 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. రాస్ టేలర్ 112 టెస్టుల్లో 196 ఇన్నింగ్స్‌ల్లో 7,683 పరుగులు సాధిస్తే.. కేన్ విలియమ్సన్ కేవలం 92 టెస్టుల్లో 161 ఇన్నింగ్స్‌ల్లోనే ఈ ఘనతను అందుకోవడం విశేషం. వీరిద్దరి తర్వాత న్యూజిలాండ్ తరపున అత్యధిక టెస్ట్ పరుగులు చేసిన జాబితాలో స్టీఫెన్ ఫ్లేమింగ్(7172), బ్రెండన్ మెక్‌కల్లమ్(6453), మార్టిన్ క్రోవ్(5444), జాన్ రైట్(5334), టామ్ లాథమ్ (5038) ఉన్నారు.




# ప్రైవేట్ ఆల్బమ్‌లతో బిజీగా రాహుల్ సిప్లిగంజ్




సింగర్ రాహుల్ సిప్లిగంజ్ తన పాటలతో కంటే ఎక్కువగా బిగ్ బాస్ ద్వారానే ప్రేక్షకులకు దగ్గరయ్యాడు. బిగ్ బాస్ షోలో భాగంగా ఒక సీజన్లో పాల్గొన్నారు. సీజన్ విన్నర్ ట్రోఫీ కొట్టి హాట్ టాపిక్ అయ్యాడు. ఇక ప్రస్తుతానికి ఆర్ఆర్ఆర్ నాటు నాటు సాంగ్ హిట్ ని సూపర్ గా ఎంజాయ్ చేస్తున్న రాహుల్ సిప్లిగంజ్.. తన తదుపరి ప్రాజెక్టుల మీద దృష్టి పెట్టాడు. ఒక పక్క సాంగ్స్ ప్రైవేట్ గా చేస్తూనే మరోపక్క సినిమాలు చేస్తున్నాడు. అదేవిధంగా ప్రైవేటు ఆల్బమ్స్ కూడా చేస్తూ బిజీ బిజీగా గడుపుతున్నాడు. ఇటీవల కృష్ణవంశీ రంగమార్తాండ సినిమాతో నటుడిగా మారిన రాహుల్ సిప్లిగంజ్.. మధ్యలో చాలా సినిమాల్లో నటించాడు. ఇప్పటికే కొన్ని సినిమాలు విడుదలయ్యాయి కూడా. అయితే ఇప్పుడు రాహుల్ సిప్లిగంజ్ దుబాయ్ నుంచి షేర్ చేసిన ఒక వీడియో హాట్ టాపిక్ అవుతోంది. దుబాయిలో బికినీ భామలతో కలిసి రాహుల్ సిప్లిగంజ్ డాన్స్ చేస్తూ ఒక వీడియోని షేర్ చేశాడు. దుబాయ్ అంటే ఇలానే ఉంటుందని చెబుతూ ఆయన దానికి ట్యాగ్ పెట్టాడు. ఒక పాట షూటింగ్ కోసం దుబాయ్ వచ్చామని ఈ పాటని భారీ ఎత్తున ప్లాన్ చేశారని రాహుల్ సిబ్లిగంజ్ చెబుతున్నాడు. ఈ పాటను ఎలా షూట్ చేస్తున్నామో చూడండి అంటూనే ఆయన ఒక శాంపిల్ వీడియో కూడా రిలీజ్ చేసినట్లుగా తెలుస్తోంది. ఆ వీడియోలో బికినీ భామలతో రాహుల్ సిప్లిగంజ్ రచ్చ చేస్తున్నట్లుగా కనిపిస్తోంది. నిజానికి రాహుల్ సిప్లిగంజ్ కి నాటు నాటు సాంగ్ వల్ల నేషనల్ వైడ్ గా కూడా క్రేజ్ లభించింది. ఈ సాంగ్ కి సంగీతం అందించింది కీరవాణి అయినా పాడింది రాహుల్ సిప్లిగంజ్ కాలభైరవ కావడంతో వారిద్దరికీ కూడా మంచి క్రేజ్ అయితే లభిస్తోంది. దాన్ని ఇంటర్నేషనల్ వైడ్ గా వాడుకుందామని రాహుల్ సిప్లిగంజ్ ఫిక్స్ అయిపోయినట్టుగా అర్థమవుతుంది.

# వరుస ఆఫర్లు కొట్టేస్తున్న పూజాహెగ్డే



సౌత్, నార్త్ అనే తేడా లేకుండా స్టార్ హీరోయిన్‌గా కొనసాగుతోంది పూజా హెగ్డే. రిజల్ట్ ఎలా ఉన్నా.. ఆమెకు మాత్రం వరుస అవకాశాలు క్యూ కడుతున్నాయి. తాజాగా పూజ లిస్టులోకి మరో మూవీ చేరుతోంది. తమిళ హీరో ఆర్యకి జోడీగా కనిపించనుందనే టాక్ వినిపిస్తోంది. పదమూడేళ్ల క్రితం కార్తి హీరోగా నటించిన 'ఆవారా' చిత్రం అప్పట్లో సూపర్ హిట్‌గా నిలిచింది. దర్శకుడు లింగుస్వామి దీనికి సీక్వెల్ ప్లాన్ చేశాడు. ఈసారి కార్తి కాకుండా ఆర్య హీరోగా నటించబోతున్నాడు. అతనికి జంటగా పూజా హెగ్డే నటించనుందనే ప్రచారం కోలీవుడ్‌లో జరుగుతోంది. లింగుస్వామి చెప్పిన స్టోరీకి పూజ కనెక్ట్ అయ్యిందని, అందుకే సీక్వెల్‌కు సై అందనే వార్తలు వినిపిస్తున్నాయి. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రస్తుతం మహేష్ బాబు హీరోగా త్రివిక్రమ్ తీస్తున్న చిత్రంలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తోంది. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్‌లో జాయిన్ కానుంది. మరోవైపు.. సల్మాన్ ఖాన్‌తో కలిసి పూజ నటించిన 'కిసి కా భాయ్.. కిసి కి జాన్' ఏప్రిల్ 21న రిలీజ్ కానుంది.





# మళయాల చిత్రరంగంలో విషాదం

## యువదర్శకుడు జోసెఫ్ మనుజేమ్స్ మృతి



మలయాళ సినీ రంగానికి చెందిన యువ డైరెక్టర్ జోసెఫ్ మను జేమ్స్ ఆకస్మికంగా కన్నుమూశారు. ఆయన మృతి వార్త తెలుసుకున్న అభిమానులు తీవ్ర దగ్భ్రాంతికి గురయ్యారు. తొలి చిత్ర దర్శకుడిగా ఆయన రూపొందించిన నాన్సీ రాణి సినిమా రిలీజ్ కు ముందే ఆయన మరణించడం ఆయన అభిమానులను మరింత బాధిస్తోంది. అయితే హెపటైటిస్ వ్యాధితో బాధపడుతూ.. న్యూమోనియా ఆరోగ్య సమస్యతో చికిత్స కోసం ఆస్పత్రిలో చేర్చారు. కేరళలోని ఎర్నాకులం రాజగిరి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన.. ఈ నెల 25వ తేదీన కన్నుమూశారు. జేమ్స్ వయసు 31 ఏళ్లు మాత్రమే. ఫిబ్రవరి 26వ తేదీన ఆయన అంత్యక్రియలు ముగిశాయి. బాల నటుడిగా సినీ రంగంలో అడుగు పెట్టిన ఆయన.. డైరెక్టర్ సాహు జేమ్స్ రూపొందించిన ఐయామ్ క్యూరియస్ అనే చిత్రంలో నటించారు. ఆ తర్వాత అసిస్టెంట్ డైరెక్టర్ గా కో డైరెక్టర్ గా మలయాళ కన్నడ హిందీ రంగాల్లో పలు సినిమాలకు పని చేశారు. ఇటీవలే ఆయన నాన్సీ రాణి అనే సినిమాకు దర్శకత్వం వహించారు. ప్రస్తుతం ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు తుది దశలో ఉన్నాయి. ఈ చిత్రంలో అహానా కృష్ణ అర్జున్ అశోకన్ హీరోహీరోయిన్లుగా నటించారు.ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే తొలి సినిమాను థియేటర్ లో చూడాలనే కల తీరకుండానే మను జేమ్స్ చనిపోయారు. నాన్సీ రాణిలో జోసెఫ్ తో కలిసి పని చేసిన అజు వర్గీస్ ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అత్యంత సునిశితమైన పరిశీలనా శక్తి అద్భుతమైన ప్రతిభ కల్గిన దర్శకుడు అని ప్రశంసించారు. అకాల మరణం చెంది అందరినీ దుఃఖ సాగరంలోకి నెట్టిన జోసెఫ్ మను జేమ్స్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. అహానా కృష్ణ కూడా డైరెక్టర్ మృతి పట్ల ఆవేదన వ్యక్తం చేసింది. దేవుడు ఇలా తమ నుంచి జేమ్స్ ను దూరం చేస్తాడని అనుకోలేదంటూ ఎమోషనల్ అయింది.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in